క్లుప్తంగా

ఉపాధ్యాయుడిపై దాడి దుర్మార్గం


నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి : ఉపాధ్యాయుడిపై దాడి దుర్మార్గమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం తెలుగుగంగ కాలనీలోని సరస్వతిబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఉర్దూ ఉపాధ్యాయు డి మృతికి కాసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయచోటి పట్టణంలో కొత్తపల్లి ఊర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఇజాజ్ అహ్మద్‌పై విద్యార్థులు దాడి చేయడం బాధాకరమన్నారు. ఆయన మృతికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు


వాహనదారులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ రామస్వామి

సత్యవేడు : వాహనదారులు లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామస్వామి హెచ్చరించారు. గురువారం రాత్రి సత్యవేడులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఆర్సీ, ఇన్సూరెన్సు, పొల్యూషన్ వంటి రికార్డులు ఉండాలన్నారు. 18 ఏళ్ల వయస్సులోపు పిల్లలు వాహనాలు నడపరాదన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను కోరారు. త్రిబుల్ రైడింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు.రోడ్డు పై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపరాదని హెచ్చరించారు.

అంధకారంలో భరద్వాజ గిరిజన కాలనీ


చిమ్మ చీకటిలో భరద్వాజ గిరిజన కాలనీ

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని భరద్వాజ గిరిజన కాలనీ చిమ్మ చీకట్లో మగ్గుతోంది. అయిదు రోజులుగా కురిసిన వర్షాలకు ఈ కాలనీలో వీధి దీపాలు వెలగడంలేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ శివారు కావడంతో ఎక్కడ విష పురుగులు ఇళ్లలోకి చేరుతాయోనని ఆందోళన చెందుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

విలేకరికి రక్షణ కల్పించాలని ఎస్పీకి ఫిర్యాదు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీఆర్‌కే న్యూస్ రిపోర్టర్ భాస్కర్‌పై కొందరు బెదిరింపులకు దిగడంపై జర్నలిస్టు సంఘాలు, తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని వార్తలు స్థానిక విలేకరులకు సంబంధం లేకుండా సెంట్రల్ డెస్క్ నుంచి టెలికాస్ట్ అవుతాయని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్‌కే న్యూస్ ఆఫ్‌ది రికార్డు వార్త టెలీకాస్ట్‌కు సంబంధించి రిపోర్టర్ భాస్కర్‌పై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే పీఏ దుర్భాషలాడటం, టీడీపీ నాయకులు కొందరు బెదిరింపులకు దిగడం, కేసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడంపై జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విలేకరికి ఎలాంటి ఇబ్బంది కలిగించినా తిరుపతి జిల్లా జర్నలిస్టులు అండగా నిలుస్తామన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లామన్నారు. విలేకరికి పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, బాలు, జగదీష్, పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు అవగాహన

వరదయ్యపాళెం : రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయాలని తహసీల్దార్ రాజశేఖర్ కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ చిరంజీవి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐ శివకుమార్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శిలాఫలకాలే.. సిగ్గు పడుతున్నాయ్!

సత్యవేడులో ఇంటర్ స్టేట్ బైపాస్ రోడ్డు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులతో పాటు షాదీఖానా నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. పలు పనులకు వేసిన శిలాఫలకాలే అందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. అయిదు పర్యాయాలుగా ఎన్నికైన ఎమ్మెల్యేలు పనులు చేపడతామని హామీలు గుప్పించారే తప్ప వసతుల కల్పన ఊసే లేదు. 25 ఏళ్లుగా సత్యవేడు ప్రజలు ఎదురుచూస్తున్న దాసుకుప్పం బైపాస్, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులు ఎండమావిగానే మారాయి.

- బైపాస్‌రోడ్డు, సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు పనులకు గ్రహణం
- నెరవేరని సత్యవేడు వాసుల చిరకాల కోరిక
- 25 ఏళ్లుగా ప్రజల ఎదురుచూపులు


దాసుకుప్పం ఇంటర్ స్టేట్ బైపాస్ రోడ్డుకు వేసిన శిలాఫలకం

సత్యవేడు : నియోజకవర్గ కేంద్రంలో ప్రధానంగా రెండు పనులు చేపట్టేందుకు 25 ఏళ్ల కిందట అప్పటి మంత్రి శివప్రసాద్ , రాష్ట్ర మంత్రుల సమక్షంలో శిలాఫలకాలు వేశారు. ప్రధానంగా ఇంటర్ స్టేట్ బైపాస్ రోడ్డు నిర్మాణానికి అప్పట్లో నాబార్డ్ నిధులు రూ. 45 లక్షలు మంజూరయ్యాయి. మాజీ మంత్రి శివప్రసాద్ మంత్రి హోదాలో బైపాస్ రోడ్డుకు శిలాఫలకం వేశారు. అంతటితో స్థల వివాదంతో రోడ్డు కథ కంచికి చేరింది. స్థల వివాదం కాస్త రాజకీయ రంగు పులుముకోవడంతో చివరకు దాని ఊసే మరిచారు. అనంతరం వచ్చిన ఎమ్మెల్యేలు హేమలత, తలారి ఆదిత్య, ఆదిమూలం దాసుకుప్పం బైపాస్ రోడ్డు వేస్తామని చెప్పి ఎన్నికల్లో గెలిచారు. భూసేకరణకు నిధులు స్వల్పంగా మంజూరు కావడం.. స్వల్ప ధరకే భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రాకపోడంతో ఎమ్మెల్యేలు వారి అయిదేళ్ల కాలం వెల్లదీసారే తప్ప బైపాస్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేయలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.


షాదీఖానా శిలాఫలకం.. పక్కనే అర్ధంతరంగా ఆగిన భవనం


సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుకు వేసిన శిలాఫలకం

భూసేకరణలో జాప్యం

సత్యవేడు పట్టణంతో పాటు మండలంలోని మరో 15 పంచాయతీలకు తాగునీటి సమస్య తీర్చే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు ఎండమావిగానే మిగిలింది. అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్ రూ. 4 కోట్లు మంజూరు చేయించి, దీనికి శిలాఫలకం వేయించారు. ఈ పనుల్లో భాగంగా తెలుగు గంగ కాలువ సమీపంలో ఫిల్టర్ బెడ్, పంపింగ్ మోటార్, తెలుగు గంగ కాలువలో బోరు ఏర్పాటు చేశారు. గంగ కాలువలో నీటి ప్రవాహం ఉంటే సత్యవేడు ప్రజలకు నీటి సరఫరాకు ఇబ్బంది ఉండదు. నీటి ప్రవాహం ఆగితే కాలువలోని బోరు అన్ని ప్రాంతాలకు నీరు అందించడం సాధ్యం కాదు.

రెండు సార్లు ప్రతిపాదనలు

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు రెండు పర్యాయాలు ప్రతిపాదనలు చేశారు. ట్యాంకు ఏర్పాటు 28 ఎకరాలు స్థలం అవసరం ఉంది. దళవాయి అగ్రహారం చెరువు విస్తీర్ణం 18 ఎకరాలు మాత్రమే ఉంది. మరో 10 ఎకరాలు చెరువు సమీపంలో రైతుల నుంచి భూమి సేకరణ చేపట్టాలి. పట్టా భూముల సేకరణలో అధికారులు జాప్యం చేస్తుండడంతో సమ్మర్ స్టోరేజ్ పూర్తి కాలేదు. సత్యవేడు ప్రాంతంలో ఎస్ఈజెడ్ ఉండడంతో భూములు ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో భూసేకరణ అధికారులకు తల నొప్పిగా మారింది. ప్రస్తుతం భూసేకరణకు నిధులు కేటాయింపు భారీగా పెంచాల్సిన అవసరం ఉంది.


సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు ఎంపిక చేసిన దళవాయి అగ్రహారం చెరువు

షాదీఖానా పనులు ఇలా..

పంచాయతీ పరిధిలో ముస్లిం సోదరులు వివాహాలు జరుపుకొనేందుకు అప్పటి ఎమ్మెల్యే శివ ప్రసాద్‌ను కోరారు. 25 ఏళ్ల కిందట షాదీఖానా ఏర్పాటుకు అప్పట్లో శిలాఫలకం వేశారు. ఇప్పటి వరకు షాదీఖానా నిర్మాణం కొనసాగుతూనే ఉంది. భవనం పనులు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో నేటికీ అసంపూర్తిగానే ఉంది.

ఎమ్మెల్యే చొరవ చూపాలి

రెండు పర్యాయాలు సత్యవేడు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోనేటి ఆదిమూలం సత్యవేడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు నిధులు సమకూరుస్తారని స్థానికులు విశ్వసిస్తున్నారు.

తాగునీటి వసతి కల్పించాలి



సత్యవేడు పంచాయతీలోని దళవాయి అగ్రహారం చెరువును సమ్మర్ స్టోరేజ్‌గా ఆధునీకరించి. సత్యవేడుతో పాటు 15 గ్రామాలకు నీటి వసతి కల్పించాలి. తెలుగుగంగ కాలువలో నీరులేకపోతే తాగు నీటి సరఫరాకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు త్వరితగతిన సమ్మర్ స్టోరేజ్‌కు భూసేకరణ పనులు చేపట్టాలి.

– గోవిందస్వామి, మాజీ సర్పంచ్ , కేఎన్‌పేట

షాదీఖానా పూర్తి చేయాలి



అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణం పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే నిధులు విడుదల చేయాలి. షాదీఖానా పూర్తి అయితే మండలంలోని ముస్లింలు వివాహాలు చేసుకొనేందుకు వసతి కలుగుతుంది. ప్రభుత్వ నిధులు త్వరితగతిన మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలి.

– ఇస్మాయిల్, సత్యవేడు

భూ వివాదాలకు పరిష్కారం

నారాయణవనం : భూవివాదాలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ జయరాములు పేర్కొన్నారు. మండలంలో శుక్రవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు జరిగే సదస్సులో మ్యుటేషన్, ఎల్ఈసీ, భూ తగాదా, ప్రభుత్వ భూ ఆక్రమణలపై, సెక్షన్ 22(ఎ) అభ్యంతరాలపై ఫిర్యాదులు చేసుకోవచ్చునన్నారు. శుక్రవారం పాలమంగలం నార్త్, శనివారం తుంబూరు, 10న అరణ్యంకండ్రిగ, 11న కీళగరం, 12న సముదాయం, 13న వీకే పాళ్యం, 17న బొప్పరాజుపాళ్యం, 18న భీమునిచెరువు, 19న కసిమిట్ట, 20న డీకే పాళ్యం, 21న ఇప్పన్‌తాంగాళ్, 24న కల్యాణపురం, 26న కొండలచెరువు, 27న తిరువట్యం, 28న ఎరికంబట్టు, 31వ తేదీన నారాయణవనంలో జరిగే రెవెన్యూ సదస్సులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కోరారు.

ముక్కంటిని దర్శించుకున్న టీటీడీ బోర్డు సభ్యులు

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం టీటీడీ బోర్డు సభ్యులు మహీధర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి : దీర్ఘకాలిక భూసమస్యలను పరిష్కరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. అధికారుల బృందం ప్రతి రెవెన్యూ సదస్సులో అధికారుల బృందం అర్జీలు స్వీకరించి త్వరితగతిన పరిష్కరిస్తారన్నారు. అందులో భాగంగా తొట్టంబేడు మండలంలో 6న పెన్నలపాడు, కొన్నలి, 7న పూడి, 9న ఇలగనూరు, 10న పెద్దకనపర్తి, దైనేడు, 11న పిల్లమలేడు, మామిడిగుంట, 12న కాసరం 13న గొట్టిపూడి, రాంబట్లపల్లి, 16న చియ్యవరం, 17న చేమూరు, కొండ చేను కండ్రిగ, 18న చోడవరం, పెద్దగుంట, సిద్ధగుంట, 19న విరుపాక్షిపుం, గుండేలిగుంట, 20న సాంబయ్యపాళెం, బసవయ్యపాళెం, 21న పెద్దకన్నలి, 23న చిన్నసింగమాల, గురుకులపాలెం, 24న పాయ్య, గుమ్మడిగుంట 26న రౌతు సూరమాల, 27న తాటిపర్తి, కల్లిపూడి, 28న తంగేళ్లపాళెం, గొడమాల, 30న దొంగలమడూరు, శ్రీకృష్ణాపురం, జనవరి 2న బోనుపల్లి, కంచనపల్లి, 3న చిట్టత్తూరు, 4న తొట్టంబేడు, సీఆర్‌ఎస్‌కండ్రిగ, ఈదులగుంటలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు టి.సుబ్రహ్మణ్యం

నేటి నుంచి సదస్సులు

రేణిగుంట : గ్రామ స్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం శుక్రవారం నుంచి నిర్వహించనున్న సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేణిగుంట తహసీల్దార్ సురేష్‌బాబు కోరారు. మండలంలోని మామండూరు పంచాయతీ బాలుపల్లెలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరగనున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 8వతేదీ వరకు ఈ సదస్సులు జరుగుతాయన్నారు.

ఏర్పేడులో...: ఏర్పేడు మండలం పల్లంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భార్గవి తెలిపారు. మొత్తం 9 మంది అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులతో కలసి ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

సత్యవేడు : నేటి నుంచి మండలంలో ప్రజాసమస్యలు, భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వీఆర్ ఓలు, సర్వేయర్లుతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెవెన్యూ సభలు నిర్వహించే గ్రామాల వివరాలు వెల్లడించారు. 6న చెరవి, 7న కొల్లడం, 9న ఇరుగుళం, 10న మల్లవారిపాళెం, 11న ఆరూరు, అప్పయ్యపాళెం , 12న గొల్లపాళెం,చెంగంబాకం13న వానెల్లూరు, 16న రాళ్లకుప్పం, 17న రాజగోపాలపురం, 18నపీవిపురం, 19న పెద్ద ఈటిపాకం, 20న చిన్న ఈటిపాకం,21న కొత్తమారికుప్పం,23న నరసరాజు అగ్రహారం,24న దళవాయి అగ్రహారం, 26న సత్యవేడు, 27న విఆర్ కండ్రిగ, 28న మదనంబేడు, 29న కన్నావరం, 30నసిరునం బూదూరు, 31న కాధిరివేడు, జనవరి 2న పేరడం, 3నఅంబాకం, 4న మదనంజేరి, 5న తొండుకుళ్లి,6న పుదుకుప్పం, 7న చెన్నేరి, 8వతేదీన దాసుకుప్పంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు. సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల ప్రణాళికపై సమావేశం

నాగలాపురం : మండలంలోని స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాలకు పంచాయతీ కార్యదర్శి రమేష్ చంద్ర అధ్యక్షతన గ్రామసభలో 2025–26 సంవత్సరానికి ఉపాధి పనుల ప్రణాళిక తయారీపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, కల్వర్టు, సిమెంటు కాలువ, మొదలైన పనులకు సర్పంచ్ చిన్నదొరై సుధా అధ్యక్షతన 15వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులతో రూ.64 లక్షలు కేటాయించి తీర్మానించినట్లు గ్రామాల్లో చేపట్టనున్న పనులు సభలో చదివి వినిపించారు. ఈ పనులు 2026 ఫిబ్రవరి నెల లోపు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షుడు చిన్నదొరై, ఉప సర్పంచ్ సునీత, వార్డు సభ్యులు చిరంజీవి, గౌతమ్, ప్రకాష్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


పనుల తీర్మానాన్ని చూపుతున్న సభ్యులు

కార్మికుల కనీస వేతనం రూ.31 వేలు చెల్లించాలి

శ్రీకాళహస్తి : పురపాలక సంఘంలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.31 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో శ్రీకాళహస్తి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.31 వేలకు పెంచాలన్నారు. ముఖ్యమంత్రి కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా చొరవ చూపాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి మున్సిపల్ శాఖ ద్వారానే నేరుగా కార్మికులకు జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించిన 24 మంది కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ఆపివేయడం చాలా దుర్మార్గమన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వైఎస్ మణి, హరినాథ్, కొండమ్మ, శారద, వెంకటేష్, తిరుపాల్, నేతాజీ, వనజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాధాకృష్ణ

స్తంభించిన రాకపోకలు


సుబ్బరాజుకండ్రిగ వద్ద దిగబడిపోయిన కంటైనర్ లారీ


ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన పరిశ్రమల కార్మికులు

- లారీ ఇరుక్కుపోవడంతో అవస్థలు
- 3 గంటల పాటు బారులు తీరిన వాహనాలు
- పైపులైన్ పనులు తెచ్చిన తంటాతో ఇబ్బందులు

వరదయ్యపాళెం : సత్యవేడు–కదూరు ప్రధాన రోడ్డు సుబ్బరాజుకండ్రిగ వద్ద భారీ కంటైనర్ లారీ గ్యాస్ పైపులైన్ ఏర్పాటుకు తవ్వి వదిలేసి రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టి కుప్పను తప్పించబోయి రోడ్డు పక్కన కంటైనర్ దిగబడిపోయింది. దీంతో ఓ వైపు మట్టికుప్పలు, మరోవైపు దిగబడిన కంటైనర్ లారీ రోడ్డుకు అడ్డంగా ఉండిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు 3 గంటల పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. దీంతో ఉదయం 7 గంటలకే ఈ ఘటన జరగడంతో అటు పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకుని సకాలంలో వెళ్లలేక అవస్థలు పడ్డారు. సత్యవేడు–శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డు మార్గంలో ఏర్పాటవుతున్న గ్యాస్ పైపులైన్, వాటర్ లైన్‌లు వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన పైపులైన్లు కుంగిపోవడంతో ఆ గోతుల్లో భారీ వాహనాలు దిగబడిపోతున్నాయి. రెండు రోజుల క్రితం నెలవాయి వద్ద కంటైనర్ లారీ పైపులైన్ గోతిలో దిగబడి గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

ముందే హెచ్చరించిన సాక్షి

ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా పైపులైన్ల కోసం గోతులు తీయడంపై ఈ ఏడాది నవంబర్ 15న అంతా మా ఇష్టం అనే కథనాన్ని ప్రచురించి అధికార యంత్రాంగాన్ని , జరిగే నష్టాల గురించి హెచ్చరించింది. కానీ అధికారులు అప్రమత్తం కాకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


అంతా మా ఇష్టం

నిర్లక్ష్యపు పైపులైన్లపై ఈ ఏడాది నవంబర్ 15న సాక్షిలో ప్రచురితమైన కథనం

పేదల ఇళ్ల పరిస్థితిపై నిలదీత

- ఏర్పేడు మండల సమావేశంలో సభ్యుల మండిపాటు
- ఎంపీ ఫొటో లేకపోవడంపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వ్యాఖ్యలపై అభ్యంతరం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భార్గవి

రేణిగుంట(ఏర్పేడు) : గత ప్రభుత్వ హయాంలో జరిగిన హౌసింగ్ పనులు తప్ప ఈ ఆరు నెలల్లో పేదల పక్కా ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు ఖర్చు చేయలేదని, ఎక్కడి బిల్లులు అక్కడే పెండింగ్‌లో ఉన్నాయని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు హౌసింగ్ ఏఈని నిలదీశారు. ఏర్పేడు ఎంపీపీ గీత అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది.

బ్యానర్‌లో ఎంపీ ఫొటో లేకపోవడంపై అభ్యంతరం

సర్వసభ్య సమావేశానికి సంబంధించి వేదిక మీద ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ ఫొటోలు మాత్రమే ముద్రించారు. దీంతో సభ ప్రారంభమైన వెంటనే ప్రొటోకాల్ ప్రకారం తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి ఫొటో ఎందుకు ముద్రించలేదని మండల వైస్ ఎంపీపీలు జమ్మల శ్రీనివాసులయాదవ్, జనార్దన్‌రెడ్డి.. ఎంపీడీఓ సౌభాగ్యంను నిలదీశారు. పొరపాటు జరిగిందని, ఇకపై ప్రొటోకాల్ నిబంధనలను పాటిస్తామని ఎంపీడీఓ స్పష్టం చేశారు. అనంతరం శాఖల వారీగా మండల సమస్యలను చర్చించారు. ఏర్పేడులో 16 మంది సొంత స్థలాలుండి పక్కా ఇళ్ల పథకం కింద ఇళ్లను నిర్మించుకుంటే ఇప్పటి వరకు కేవలం ఇద్దరికి మాత్రమే బిల్లులు చెల్లించారని, నలుగురికి సగం బిల్లులే వచ్చాయని, మిగిలిన వారికి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని సర్పంచ్ నల్లపాళెం శివయ్య హౌసింగ్ ఏఈని ప్రశ్నించారు. జనన ధ్రువీకరణ పత్రాల మంజూరు ప్రక్రియ ఆలస్యమవుతోందని, విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారని చిందేపల్లి సర్పంచ్ పెంచలయ్య సభలో తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఎండీ పుత్తూరు ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి 20 మందికి పైగా చిన్నారులు 1.5 కిలోమీటరు దూరం నడుచుకుంటూ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ స్కూల్‌కు వస్తున్నారని, అక్కడ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ మోహన్‌ప్రియ కోరగా పదేళ్లుగా కొత్త సెంటర్లను మంజూరు చేయలేదని సూపర్‌వైజర్ సమాధానమిచ్చారు. దీంతో పిల్లలు అవస్థలు పడాల్సిందేనా..? అని నిలదీశారు. ఏర్పేడు కలుజుకాల్వ ఆక్రమణలకు గురికావటంతో చెరువు నిండి నీళ్లన్నీ ఊరు మీదకు వస్తున్నాయని, ఆక్రమణలను తొలగించాలని, ఓ ప్రజాప్రతినిధిగా ఎన్ని సార్లు ఫోన్ చేసినా సమాధానమివ్వలేదని ఇరిగేషన్ జేఈఈ జయకుమార్‌ను సర్పంచ్ శివయ్య ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సౌభాగ్యం, తహసీల్దార్ భార్గవి, ఏఈలు వాసుదేవయ్య, సుబ్రమణ్యం, రవితేజ, మండల పశువైద్యాధికారి శిల్పారెడ్డి, పాపానాయుడుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మధురిమ పాల్గొన్నారు.


ఎంపీ ఫొటో లేకపోవడంపై అధికారులతో వాగ్వాదం చేస్తున్న సభ్యులు